# హృదయశోభ

"నను పాలింపగనడచీ వచ్చితివా ...

గాలి అలల మీద తేలియాడుతూ శ్రుతానంద మాధురులతో అలరిస్తున్న ఆ మురళీనాదం నన్ను ఏదో తెలీని లోకంలో విహరింప జేస్తున్నది. బియ్యం బాగుజేసే పని మరచిపోయి, కిటికీకి తలనానించి ఆ అమృతధారలో మునకలేస్తున్నాను. అలా ఎంతసేపు గడిచిందో ...

స్టౌమీద గిన్నెలోని పాలు బుసబుసమని హెచ్చరించేదాకా తెలియలేదు. అయినా పాలకోపం చల్లార్చి, పాట మాధుర్యం పూర్తిగా చవిచూస్తే గాని తృప్తి కల్గలేదు.

రుచిహీనంగా సాగుతున్న జీవితంలో ఏవో కొత్తకాంతులు పరుచుకుంటున్న అనుభూతి గతవారం రోజులుగా నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. నెలరోజుల క్రితం ప్రక్క ఫ్లాటు ఖాళీ అవుతుంటే చాలా దిగులనిపించింది. సౌగంధిక బాగా కలివిడిగా ఉంటూ ఒంటరితనాన్ని తెలియనిచ్చేది కాదు. వాళ్ళాయనకి బదిలీ కావడంతో ఆ కుటుంబం వెళ్లక తప్పలేదు.

సిటీకి దూరంగా ఉన్న ఆ అపార్టుమెంటులో నిండా జనాలున్నా ఏకాంతంగా ఉన్నట్లే అనిపిస్తుంది. ఎవరికివారే గదా ఎప్పుడూ. అందులోనూ తమది ఐదో అంతస్థు. అన్నీ విడివిడి ఫ్లాట్లు. అవి విశాలంగానే ఉన్నాయి. అందులో ఉండే మనుషుల మనసులు విశాలంగా ఉండొద్దూ. అందరితో కలిసి, అందరినీ కలిపే సౌగంధిక వెళ్ళడం అందరికీ లోటే అయ్యింది. కాని, ఆ లోటు ఇంత అపురూపంగా పూరింపబడుతుందని ఆ క్షణం అనిపించలేదు.



పదిరోజుల క్రితం ఎ.యం.పి.యం. (అంటే ఎడమొగం - పెడమొగం)లా ఉన్న ఓ జంట ఆ ఇంట దిగింది. మాటలే రానట్టు; ఆమె చిరునవ్వొకటే తెలిసినట్టు అతను ... ఏం మనుషులో ! అనుకోకుండా ఉండలేకపోయింది. అంతలోనే ఆవిడ దేనికో రుసరుసలాడుతూ, అలిగి వెళ్ళింది. మూడోరోజు గావచ్చు అతను ...

"మీకభ్యంతరంలేకపోతే ..." గుమ్మం ముందు నిలుచొని, ఏదో చెప్పబోతూ అర్థాంతరంగా ఆగిపోయాడు.

అంతసేపూ టీ.వీ. చూడ్డంలో లీనమై ఉన్న తాను హఠాత్తుగా తిరిగేసరికి అలా పలకరించాడు. ఎంతసేపటి నుండి నిలుచున్నాడో, దేనికో ఈ అభ్యర్థన ... తన ఆలోచనల్లో తానుండగా -

"మేడం ..." అతను మళ్ళీ పలకరించాడు.

"ఆ ... ఆ ... ఏంటో చెప్పండి ... రండి ! లోనికి ..."హడావుడి పడిపోయింది అంతలోనే.

"పర్లేదు మేడం ... నేను ఫ్లూట్ వాయించుకోవాలి ... మీకు డిస్టర్బ్ అవుతుందేమోనని..."

"వ్వాట్ ? మీరు ఫ్లూట్ వాయిస్తారా ?"ఆశ్చర్యం, ఆనందం కలగలసి చిన్నగా కేక పెట్టినట్టంది తను. అలా అనుకుంటే బాగుండేదనిపించింది తర్వాత.

సమాధానంగా అతని చిరునవ్వు.

"మీ యింట్లోనేగా ...! మాకెందుకభ్యంతరం ?"

తన ప్రశ్నలోని సమాధానంతో సంతృప్తి పడి వెళ్ళిపోయాడు.

కళ్ళముందు నుండి కదిలాడు గాని, ఆ తర్వాత క్షణం నుండే హృదయం కేన్వాసు మీద రూపుదిద్దుకున్నాడు అతని మురళిగానంతో.

తన చిన్నప్పుడు కొహెడలో ఉండగా నాన్నతో పోరుబెట్టి అన్నపూర్ణ టీచర్ వద్ద పిళ్ళారి గీతాల దాకా సంగీతం నేర్చుకున్నది. ఆ స్వరసాధన కన్నా ఆ టీచర్ గానామృతం ఎంతగానో ఆకట్టుకునేది. మరోనెల రోజుల్లో వాళ్ళబ్బాయి హేమూ చంద్ర వస్తున్నాడని, అతను సెలవులకి నెలరోజులు ఉంటాడని మురళి బాగా వాయిస్తాడని, ఆసక్తి ఉంటే మీరూ నేర్చుకోవచ్చని ... ఏమేమో చెప్పింది ఆవిడ. కాని, ఆ సుముహూర్తం రాకముందే నాన్నకిచొప్పదండికి బదిలీ కావడంతో 'కల' కలగానే మిగిలిపోయింది. ఆపై బోర్డు పరీక్షలు – పెద్ద తరగతులు చదువులు చట్టుబండలు చూస్తుండగానే పెళ్ళి పేర గుదిబండలు ...

ఇన్నాళ్ళకు ఏ దేవతలో కరుణించి అప్పుడెప్పుడో పన్నెండేళ్ళ క్రితం మిస్సయిన మురళీరవం నా సన్నిధికే చేరేలా చేశారు. ఇప్పుడనిపిస్తున్నది సౌగంధిక వాళ్ళు వెళ్ళడం ఎంత మంచిదయిందీ అని.

అతనిపేరు వేణు. ఆవిడ పేరు రవళి. చూడచక్కని జంటే కాని వాళ్ళ మధ్య అంత సయోధ్య ఉన్నట్టు లేదు. ఉన్న మూడురోజుల్లో ఆమె కనబడ్డ సందర్భాలు చాలా తక్కువ. అదయినా ఏదో అవసరం కొద్దీ. అతనిది ఆర్టీసీలో మినిస్టీరియల్ ఉద్యోగం. ఉదయం ఆరునుండి ఎనిమిది వరకు అతను మురళీ సాధన చేసేటప్పుడు తప్ప ఏం చేసుకుంటాడో, ఏం చేస్తుంటాడో తెలీదు ...

"ఏంటే టిఫినేమైనా చేసేదుందా ?"ఆయనగారి పలకరింపు. అప్పుడే నిద్ర నుంచి లేచి, లుంగీ సర్దుకుంటూ ఎగాదిగా చూశాడు నన్ను.

"హూ ! ఇప్పుడు చేస్తున్నదేంటో...?" చురుగ్గా అంది తను. తన గొంతులోని విసుగుదల తనకే ఆశ్చర్యం గొలిపింది. ఇంతకు మునుపెన్నడూ ఇలా మాట్లాడింది లేదు.

"రాజును చూసిన కళ్ళతో మొగుడ్ని చూస్తే మొత్తబుద్ధి" అయ్యిం"దన్న సామెత గుర్తొచ్చి, ఉలిక్కిపడ్డాను.

రోజులు చిత్రంగా గడుస్తున్నాయి ...

ఒక్కోసారి మనసు ఆనందంతో చిందులేస్తోంది. మరోసారి ఏదో తెలీని వేదనతో రగిలిపోతోంది. ఇంకోసారి స్తబ్దంగా మారిపోతుంది. మరోసారి అయోమయంగా అనిపిస్తోంది. మొత్తంమీద ఏదో అసంతృప్తి నా నరనరాల్లో నిండి తీవ్రమైన డిప్రెషన్‌కి గురిచేస్తున్నట్టు తెలుస్తోంది.

నాలుగేళ్ళ మా దాంపత్య జీవితంలో ఇంత నిస్పృహ ఎప్పుడూ లేదు. ఎందుకిలా జరుగుతోంది ...???

బాగా ఆలోచిస్తే వేణు మురళీరవం కారణమేమో అనిపించసాగింది. అలాగని తనకు వేణువు నేర్చుకోవాలనీ లేదు, కాని, అది వింటూ ఉండి పోవాలని, ఆ వేణుని గురించి తెలుసుకోవాలని, అతనితో ఏవేవో మాట్లాడాలని ... ఇంకా ... అవతలి భావాలు అస్పష్టం. ఒక్కటి మాత్రం నిజం. తన ఆలోచనలు దిగజారలేదు. కాని ఏదో కోల్పోయానన్న భావం నన్ను పీడిస్తున్నదనేది మాత్రం తెలుస్తూన్నది.

"మేడం ..." అది వేణు పిలుపు.

ఏమో పిలిచాడో, అది తన భ్రమో ! రొటీన్ టీ.వి. ప్రోగ్రామ్స్ బోర్‌గా అనిపిస్తుంటే 'కృష్ణపక్షం'లో 'ఆకులో ఆకునై...' ని తడుముతున్నాను. స్పష్టాస్పష్టంగా వేణు గొంతు వినిపించినట్లనిపించింది. నాలో నేనే నవ్వుకుంటూ పేజీ తిప్పాను. 'తరువెక్కి యలనీల గిరినెక్కి మెల ...'

"మేడమ్ ..." ఈసారి స్పష్టంగా వినిపించింది. భ్రమకాదు, నిజమే. అది వేణు గొంతు.

ఒక్క పరుగున బెడ్‌రూం నుండి గుమ్మందాకా వచ్చేశాను. అతణ్ని చూసేసరికి గుండె గుభిల్లుమంది. ఎప్పుడూ అలా చూళ్ళేదు.

కళ్ళు లోతుకు పోయినట్లున్నాయి. జుట్టు చెరిగిపోయి ఉంది. మనిషి బాగా నీరసించి నట్లున్నాడు. నన్ను చూడగానే జీవం లేని నవ్వొకటి లిప్తమాత్రం అతని పెదాలపై మెరిసి మాయమైంది.

"లోపలికి రండి ..."

"పర్లేదు మేడం ... కొంచెం జ్వరంగా ఉంది. టాబ్లెట్ వేసుకోవాలి ... ఏమైనా తినకుండా వేసుకుంటే ... ప్రాబ్లం వస్తుందేమో ...

అతని ప్రాబ్లం నాకర్థమైంది. వెంటనే అన్నాను.

"రండి ... కూర్చోండి ... ఏం తింటారు ? చపాతీ ... ? ఉప్మా ..." నా చొరవ నాకే ఆశ్చర్యం కల్గిస్తున్నది.

"సారీ మేడమ్ ... మీకు శ్రమ యిస్తున్నాను.

... కూర్చునే ఓపిక లేదు మేడం ... మళ్ళీ వస్తాను ..." అడుగులో అడుగేసుకుంటూ అతను వెళ్ళాడు.

నేను ఆలోచనలో పడ్డాను. ఉప్మా తొందరగా చేసెయ్యొచ్చు. కాని చపాతీ శ్రేష్ఠమేమో! పాపం ... ఎప్పుడూ ఏదీ అడగలేదు. రెణ్ణి ముషాలాలస్యమైనా చపాతీ చేయడం మేలనిపించింది. అతనికే కూర యిష్టమో, తనకయితే ఆలూ టమాటా నచ్చుతుంది. అయినా జ్వరంతో బాధపడేవాళ్ళ జిహ్వాకి ఏదయినా చేదే. పోనీ తనకిష్టమైందే చేస్తే.

పది నిముషాల్లో టిఫిన్ రెడీ అయ్యింది. అతను రాలేదు. వెళ్ళి పిలవాలా, వద్దా ? అన్న మీమాంసలో కొట్టుకున్నాక, పిలవడంకంటె టిఫిన్ తీసుకుని వెళ్ళి ఇవ్వడం మేలనిపించింది.

డోర్‌బెల్ మోగించాను ... రెస్పాన్స్ లేదు.

తలుపు నెట్టాను. తెరుచుకుంది.

తటపటాయిస్తూ లోపలికడుగు పెట్టాను.

"వేణుగారూ !" మెల్లగా పిలిచాను .... సమాధానం లేదు.

గుండె వేగంగా కొట్టుకుంటుండగా మరింత ముందుకెళ్ళి, బెడ్‌రూంలోకి తొంగిచూశా.

అతను నిద్రపోతున్నాడు. రాత్రి సరిగ్గా నిద్రపోయాడో లేదో, డిస్టర్బ్ చేయడం మంచిది కాదని మనసు హెచ్చరించింది.

నిశ్శబ్దంగా రెండడుగులు వెనక్కివేసి, టీపాయ్‌మీద టిఫిన్ ప్లేట్ పెట్టేసి, యాదృశ్చికంగా

గోడవైపు తిరిగి చూసాను. అద్భుతం ...

అందమైన పెయింటింగ్స్ నాలుగు ... ప్రకృతి గ్రామీణ జీవనం, ఒక లంబాడీ స్త్రీ, రాధాకృష్ణులు మాటల్లో వర్ణించలేనంత ఆకర్షణీయంగా ఉన్నాయి. పరిశీలించి చూస్తే క్రింద ఆర్టిస్ట్ పేరు కనిపిస్తోంది. అది 'వేణు' వేసినవే. అలా ఎంతసేపు చూస్తుండిపోయిందో..

"మేడం ... ఎంతసేపయింది వచ్చి .... ? ... నేనే వచ్చేవాడ్ని కదా" నొచ్చుకుంటూ పలకరించాడు వేణు.

"సారీ మీ అనుమతి లేకుండా ..." సంజాయిషీ యిస్తూనే 'పెయింటింగ్స్ అద్భుతంగా ఉన్నాయంటూ మనసులో మాట చెప్పాను.

"థ్యాంక్యూ మేడం ... ప్లీజ్ కూర్చోండి !" అతను అభ్యర్థించాడు.

"ఇంకోసారి ఎప్పుడైనా వచ్చి తీరికగా చూస్తాను ... ఔను ! మీ రవళి ఎప్పుడొస్తుంది?" ఈ ప్రశ్న అడగకుండా ఉండాల్సిందేమో ! ప్చ్ అడిగేశా.

అతని మొహం మ్లానమైంది. ఆ మౌనం అర్థమయింది. 'సారీ' చెబుతూ గదికి తిరిగొచ్చేశాను.

ఈ రోజెంతో ఉల్లాసంగా గడిచింది. సాయంత్రానికి వేణు కూడా కొంచెం కోలుకున్నాడు. సాయంత్రం కాఫీ తాగి బయటికెళ్ళాడు.

రెండ్రోజుల తర్వాత -

"వేణు గురించి నీ అభిప్రాయం ..." రాత్రి పదిన్నర వేళ ఆయన ప్రశ్న.

"అంటే మీ ఉద్దేశ్యం ?" నాలో ఆవేశం, ఆవేదన పెల్లుబికాయి.

"అదికాదు సుసీ ..."

"మీరింకేం మాట్లాడొద్దు !" నాగుండెల్లో లావా మరగసాగింది. ఎంతైనా మగబుద్ధి ఎక్కడికి పోతుంది ? మీకు కళలంటేనే తెలియదు. కళాకారుల హృదయాన్నేం అర్థం చేసుకుంటారు ? మనిషి, డబ్బు, పని ... ఇవేగా మీకు తెలిసేవి. వీటన్నిటికీ అతీతమైన మనసొకటి ఉంటుందని గుర్తించడం ..." శకలాలైన హృదయాన్ని గుప్పిట్లో పట్టుకుంటూ

ప్రక్కకు ఒత్తిగిల్లి పడుకున్నాను.

"సుసీ ... నేననేది ..." అనునయిస్తున్నట్లు నా నడుం మీద చేయి చేశారు.

ఒక్క ఉదుటున బుసకొడుతున్నట్లు లేచాను. "మహానుభావా ! నువ్వేమీ చెప్పనక్కర్లేదు! నీకో దండం నన్ను ప్రశాంతంగా పడుకోనీయి !" రెండు చేతులూ జోడించాను.

ఆశ్చర్యంగా నన్ను చూశాడు. గిరుక్కున మొహం తిప్పుకొని పడుకున్నాను. చాలా సేపటి దాకా నిద్రపట్టలేదు.

ఉదయం లేచి చూస్తే ఆయన కనబడలేదు. వాకింగ్ కెళ్లారేమోననుకొని చూశాను. ట్రాక్‌సూట్ హ్యాంగర్‌కి కనిపిస్తోంది. క్యాజువల్ లేదు. వెంటనే సెల్‌కి ఫోన్ చేయాలనుకున్నాను. అంతలోనే తానెందుకు చేయాలి ? తప్పెవరిది ? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఆ ప్రయత్నం నుండి విరమించుకున్నాను.

యాంత్రికంగా పనిచేస్తున్నాను. మనసంతా ఆయన చుట్టే పరిభ్రమిస్తోంది. నేను తొందర పడ్డానేమో ! అనిపించింది. అప్పుడప్పుడూ ఏదో గిల్లికజ్జాలు మామధ్య చోటు చేసుకున్నా, అలిగేంత తీవ్ర పరిస్థితులెప్పుడూ ఎదురు కాలేదు.

"శ్రీకాంత్‌గారూ ... శ్రీకాం ..."ఆయనకోసమే. వేణు పిలుస్తున్నాడు.

డోర్ తెరిచాను. "లేరండీ ! ..." ఏం చెప్పాలో తోచలేదు.

"సాయంత్రం సినిమాకెళ్దామన్నారే ! ఎక్కడికెళ్లారు .... ?"

"..." నావద్ద సమాధానం లేదు. అది లేకపోవడం ఏదో అవమానకరంగా అనిపించింది.

అతనెలా అర్థం చేసుకున్నాడో ! ఇంకేమీ మాట్లాడకుండా వెళ్ళాడు. ఈరోజు ఆదివారం కూడా కావడం చిరాకు కల్గిస్తున్నది. మామూలుగా అయితే పదిగంటలకల్లా ఇటు ఈయనా, అటు వేణూ డ్యూటీలకెళ్ళిపోయేవాళ్లు. రొటీన్‌గా నా పనిలో నేను పడిపోయదాన్ని. నిన్నటిదాకా వేణు గురించిన ఏవో ఆలోచనలు, అతని గురించి అంతా తెలుసుకోవాలన్న క్యూరియాసిటీ అవీ ఉండేవి. రాత్రి సంఘటనతో ఇప్పుడవీ దూరమయ్యాయి. ఒకరకంగా పిచ్చెక్కినట్టుగా ఉంది.

చాలా భారంగా మధ్యాహ్నం దాకా గడిచింది. ఏదో తిన్నాననిపించాను. టి.వీ. ఆన్ చేసుకొని చూస్తున్నాను. దృశ్యాలు మెదడు దాకా చేరడం లేదు. అప్పుడప్పుడూ ఏవో కొన్ని మాటలు వినిపిస్తున్నాయి అంతే.

"శ్రీకాంత్‌గారూ ..." మళ్ళీ వేణు పిలుపు.

చిరాకనిపించింది. 'మీకేం పనిలేదా ?' అని గట్టిగా అరవాలనిపించింది. విసురుగా వెళ్లి డోర్ తీశాను.

"ఇంకా రాలేదా ...?" తటపటాయిస్తున్నాడేదో చెప్పడానికి ..." ఒక్కసారి మా గదికొస్తారా? ..."

నా కనుబొమ్మలు ముడివడ్డాయి. మరో సందర్భంలో అయితే "ఓ ష్యూర్" అనేదాన్నేమో. కాని, ఇప్పుడున్న పరిస్థితి వేరు. "అసలు నా గురించి నువ్వేమనుకుంటున్నావ్ ? నాకిలాంటి వేషాలు నచ్చవ్" అని చెప్పేసి మొహమ్మీద తలుపేయాలనిపించింది. కాని ఆ పనిచేయలేక, అతని ప్రతిపాదన నామోదించలేక అలాగే ఉండిపోయాను.

"ప్లీజ్ ! ఒక్కసారి ..." నా మనోభావాలు పట్టించుకోకుండా అతను మళ్లీ పిలిచాడు.

"సరే చూద్దాం !" అనుకుంటూ అతని వెంట కదిలాను.

నన్ను హాల్లో కూర్చోబెట్టి వేణు లోపలికెళ్ళాడు. లోపల కాఫీ కలుపుతున్నట్టు తెలుస్తొంది. ఎందుకో ఈ మర్యాదలు ?

"అదేంటి ? కాఫీ కోసం పిలిచారా ... ? అంటే మొన్న మీకు టిఫినూ, కాఫీ ఇచ్చానని బదులు తీర్చుకుంటున్నారా ?" సూటిగా అడిగాను.

"అంత మాటనకండి మేడం ... !మీరు చేసిన సాయం, ఋణం కాదు మళ్ళీ తీర్చుకోగలిగేదీ కాదు ..." అతను నొచ్చుకున్నట్టున్నాడు. అయినా నా మాటల్ని పెద్దగా పట్టించుకోకుండా ఒక పేపర్ కవర్‌ని నాకిచ్చాడు.

అది సుమారు పిల్లల పరీక్ష అట్టకు రెట్టింపు సైజు.

ఏముందో చూద్దామని కవర్ విప్పాను. ఆశ్చర్యంతో నా కళ్ళు విచ్చుకున్నాయి.

అందులో ఒక బొమ్మ నాదే. నా పక్కన ...

హఠాత్తుగా డోర్ తెరుచుకుంది .... ఎదురుగా శ్రీవారు.

అంతలో .... అతని వెనుకే ఓ అమ్మాయి ... ఆ ! ఆవిడ రవళి.

ఇద్దరూ గుమ్మంలో. ఎదురుగా నేనూ వేణు.

"వేణూ ! సినిమా టైమవుతోంది త్వరగా రెడీ అవండి ..." రవళిని అక్కడ వదిలి ఆయన మా ఫ్లాట్ వైపు నడిచారు.

"ఏవండీ !" దాదాపుగా అరిచినట్టు పిలుస్తూ అనుసరించాన్నేను.

లోపలికి వెళ్తూ డోర్ బోల్టు వేశాను.

"పిలుస్తూంటే అలా వస్తున్నారేం ?" నిలదీయడంకాదు, ఆర్తి.

"ఎలా వచ్చినా, రావలసిన చోటికే వచ్చాను కదా !" కనుబొమ్మలెగరేశారాయన.

"ఊ ! వచ్చారు. లేచిందగ్గర్నుండీ నేనెంత విలవిల్లాడిపోతున్నానో తెలుసా ?" ఆయన భుజాలమీద చేతులేసి గుండెల్లో తలదాచుకున్నాను. పోగొట్టుకున్న సంపదంతా దొరికిన అనుభూతి.

"రాత్రి విసిరికొట్టావు గదా !" అంటూనే నా వీపు నిమిరారు లాలనగా.

"అవునూ ! మీరు వెలగబెట్టిన రాచకార్యం అర్థమయ్యీ కానట్టుంది. ఇంతకూ ఏం చేశారు ? ఎక్కడికెళ్లారు ?" మాట మారుస్తూ అడిగాను.

"అది సరే ! నీచేతుల్లోని అపురూపమైన వస్తువేమిటి ?"

"అదా ! అది కానుక !" ఠక్కున చెప్పాను.

"నేనూ కానుక కోసమే వెళ్ళింది".

"అబ్బ ! అర్థమయ్యేలా చెప్పండి" బుంగమూతి పెట్టాను.

"ముందు ఆ కానుక చూపెట్టండి..." నన్ను ఇమిటేట్ చేశారు.

నవ్వాగలేదు నాకు "ముందు మీరే చెప్పాలి ..."

"ఓ.కే ... ఉదయమే లేచి రఘునాథ్‌పల్లికి వెళ్లాను". ఆయన నెమ్మదిగా సోఫాలో కూర్చుంటూ చెప్పసాగారు. నేను నేలమీద కూర్చొని ఆయన మోకాళ్ళపై చేతులు అడ్డంగా పెట్టి వింటున్నాను ...

"రవళి వాళ్ళ అమ్మగారి ఊరది. మొన్న వేణుకి జ్వరంగా ఉందని చెప్పిన రోజు రాత్రి నేను అతనితో చాలాసేపు మాట్లాడాను. రవళి లాగే ఆమె హృదయం కూడా అందమైంది. ఇద్దరూ మేడ్‌ఫర్ ఈచ్ అదర్‌లా".

'అంటే మనలా ...'అనుకున్నాను.

"ఉంటారు కదా ! రవళికి కొంచెం కోపం ఎక్కువ. ఆత్మాభిమానం అంతకంటే ఎక్కువ. వేణు మాట వరసకి వాళ్ళ అమ్మవాళ్లని ఏదో అంటే అలిగి వెళ్ళిపోయింది. ఆమె అలా వెళ్ళటం కొత్తకాదు. హైదరాబాద్ రాకపూర్వం జనగాంలో ఉండేవాళ్ళు. చీటికీ మాటికీ అలా అలిగి వెళ్ళడం, ఆమె వెంటనే ఇతను వెళ్లి తీసుకురావడం షరా మామూలుగా జరిగేది. కాని, హైదరాబాద్ వచ్చింతర్వాత కూడా అది కొనసాగడం వేణుకి మింగుడు పడలేదు. అందుకే పట్టుదలకుపోయి, అతనూ పట్టించుకోలేదు. భర్తగా అతడు పట్టుదలకు పోయినా, మనసు మాత్రం ఆమెను విడిచి ఉండలేకపోయింది. ఆ నేపథ్యంగానే అతను అస్వస్థతకు లోనయ్యాడు. విషయం తెలుసుకొని వేణుకు నచ్చజెప్పేందుకు చూశాను.

"అతను దిగి రాలేదు. నేనెందుకు దిగిరావాలి ? నాకు తాగుడు అలవాటుందా ? ఇతర దురలవాట్లున్నాయా ? కట్నం కోసం వేధిస్తున్నానా ?ఏవీ లేవే ? నేను ప్రభుత్వోద్యోగినే గాక మంచి ఆర్టిస్ట్‌గా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాను. కవితల పోటీల్లోనూ చాలా బహుమతులు గెలుచుకున్నానంటూ చాలా విషయాలు చెప్పాడు. సుసీ ! ఎన్నో జన్మల పుణ్యఫలంగా మానవ జన్మ లభిస్తుందట. అందులో మరెంతో పుణ్యం చేసుకుంటేనే కళాసాధన, కళారాధన అలవడతాయి. ఆ కళాకారుడి కలతను దూరంచేయాలనిపించింది. రఘునాథపల్లికి వెళ్ళాను. రవళి తల్లిదండ్రులతో మాట్లాడాను. రవళి నా చెల్లిలాంటిదంటూ చెప్పి అక్కడుండే నా మిత్రుడితో నాగురించి తెలియజెప్పి, ఆపై రవళికి అంతా నచ్చజెప్పాను. అతనికి జ్వరం అన్నమాట వినగానే ఆమె ఇంటికి రావడానికి సిద్ధమైంది ..."

ఆపై అతడు చెప్పాల్సిన అవసరం లేకుండానే విషయం నాకర్థమైంది. "మై హజ్‌బెండ్ ఈజ్ గ్రేట్ ..." మెల్లగా గొణుగుతూ ఆయన చేతుల్ని ముద్దుపెట్టుకున్నాను.

"సరే, ఆ కానుక ..." నా కళ్ళలోకి చూశారు.

ఇంతలో డోర్ బెల్ మోగింది. వేణు చేతిలో సినిమా టికెట్లు. చేతులు జోడిస్తూ లోపలికొచ్చాడు. "సినిమాకు మీరెళ్లిరండి !" అంటూ ఆ టిక్కెట్లు ఆయన చేతికిచ్చాడు.

"వేణూ ! మీకోస ..." ఆయన మాట పూర్తికాలేదు.

"ప్లీజ్ ! అర్థం చేసుకోండి సార్ ..." ఆయన జవాబు కోసం చూడకుండా వేణు గబగబా వాళ్ళ ఫ్లాట్‌వైపు నడిచాడు.

శ్రీవారు నామొహంలోకి చూశారు అంతా తెలిసీ.

భుజాలెగరేశాన్నేను ఏమీ తెలియనట్టు.

ఇద్దరం ఒకేసారి నవ్వుకున్నాం.

నాచేతుల్లోని పెయింటింగ్ చూశారు. ఇద్దరమూ కలిసి చూశాం. ఆ పెయింటింగ్ మమ్మల్ని మేం అద్దంలో చూసుకుంటున్నట్టుగా ఉంది అందంగా.

ఆ సౌందర్యం భౌతికమైందే కాదు, హార్దికమైందీ, ఆర్ద్రమైందీ ...

❀❀❀

(మూసీ, నవంబర్ 2005)